స్కెచ్

# కలహ కారిణి

వేదుల కామేశ్వరరావు

శ్రీ ఆఫీసులో ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంటులో ఇదివరకెప్పుడూ లేని సందడి ఈ నాడు ప్రత్యేకంగా కలగడానికి గల కారణం ఊహించడానికి ఆ బ్రాంచి సూపరెండెంటుకు ఆట్టే కాలం ఖర్చు కాలేదు. మధురస్మిత వదనంతో తెల్ల వాయిలు బట్టల మధ్య తళతళా మెరుస్తున్న సావిత్రి ఎదురుగుండా ప్రత్యక్ష ప్రమాణంగా కనబడుతూ వుంటే "ఎందుకా..." అని ఆలోచించవలసిన అవసరం సూపరెండెంటుకు మాత్రం ఎందుకు కలుగుతుంది?

"అందుకే కాబోలు..." అనుకున్నాడాయన సావిత్రి వైపు రెప్పవాల్చకుండా రెండు క్షణాలు చూసి!

ఆ రెండు క్షణాలలోనే ఏదో మించిపోతున్నట్లు ఈ ఛాన్సంతా ఈయనే కొట్టేస్తాడేమోనని కాబోలు ఏదో పని వున్నట్టు వెనకటి కాగితాలు పుచ్చుకొని గబగబా వగర్చుకొంటూ వచ్చారు ఐదారుగురు ఎన్. జి ఓలు.

తప్పనిసరిగా దృష్టి ఇటు మరల్చవలసిన అవసరం కలిగింది పాపం సూపరెండెంటుకు. వచ్చిన ఎన్. జి. ఓ. లందరూ ఇంటిదగ్గర తాము పడే బాధలు, అప్పులవాళ్ళ కేకలు, పిల్లల ఆర్తనాదాలు, భార్యల సమ్మెలూ మొదలైనవన్నీ ఆ రెండు క్షణాల పాటూ మర్చిపోయేలాగ...ఎదురుగుండా తెల్ల వాయిలు బట్టలలో మెరుస్తున్న...మధురస్మితవదన సావిత్రి!

* * *

రెండు రోజులలో ఆఫీసు యావత్తూ భారీయెత్తున మారిపోయిందనటంలో ఆశ్చర్యంలేదు. ఎప్పుడూ "లాగూ" ఎగదోసుకొంటూ కంగారుగా పరుగెత్తుకువచ్చే సూపరెండెంటు చక్కని సూటూ గ్రటా వేసి అతి స్థిమితంగా ఆఫీసులో అడుగు పెడుతూ వుండటంలోనూ, ఎన్. జి. ఓ.లలో సూట్లు వేసేవారిసంఖ్య పెరగటంలోనూ ఆట్టే ఆశ్చర్యకరమైన విషయం ఏమీ లేకపోవచ్చును.

కాని సూపరెండెంట్ ఒక్కవారం రోజులలోనే భార్యను పుట్టింటికిపంపించి, హోటల్లో మకాం పెట్టడం కొంతమందికి ఆశ్చర్యాన్నే కలిగించింది.

"సావిత్రి...ఎంత చక్కని పేరు! ఆ ముఖంలోనే వుంది ఆమె కళంతా. చూసినవాడల్లా చిత్తైపోతున్నాడు. అందుకేగా ఎస్టాబ్లిష్‌మెంటు బ్రాంచికి 'రష్' ఎక్కువయిపోయింది!" షికారుకు వెళుతూ రోజూ రోడ్డుమీద ఎన్. జి. ఓ.లందరూ అనుకొనే మాటలివి.

ఒకరోజు...ప్రొద్దుట పదిగంటలకు—జరిగిన హఠాత్సంఘటన! సావిత్రి కుర్చీలో లేదు! నాలుగు రోజులకు ఆమె వ్రాసిన సెలవు చీటీ చూసుకొని నిశ్చేష్టుడైపోయాడు సూపరెంటెండెంటు!...... "సావిత్రి శెలవు పెట్టింది" టెలిగ్రాంలా వ్యాపించింది వార్త.

...ఆనాడు ఆఫీసులో...

"మిష్టర్ రామారావ్!" సూపరెండెంటు పిలిచాడు క్లర్కు రామారావుని.

"........." సమాధానం లేదు.

"మిష్టర్ రమణారావ్!"

"రమణారావు లేడండి" రాజారావు సమాధానం.

"మీరేం చేస్తున్నారక్కడ?"

"నాకీవేళ కొంచెం తలనొప్పిగా వుందండి. కొంతసేపు రెష్టు తీసుకొంటున్నాను" రాజారావు బాధగా ఇచ్చిన జవాబు.

పచ్చివెలక్కాయ గొంతుకలో పడినట్లైనా సూపరెండెంటుగారికి సవ్వాగలేదు. కుర్చీలోనుంచి లేచి ఇవతలకు వచ్చాడాయన. రాజారావు బాధగా మూలుగుతూ బల్లమీద నడుంవాల్చాడు. కాంపౌండులో గున్నమామిడి చెట్టుక్రింద సమావేశమయ్యారు మిగిలిన గుమాస్తాలు. విస్తుపోయి కొంతసేపు చూశాడాయన. వారి వింత ధోరణి ఏమిటో ఆయన కర్థంకావటంలేదు. అసలు తనకే

ఈనాడు పనిచెయ్యాలనిలేదు. ఏమిటో బద్ధకంగా వుంది...ఏమీ తోచటంలేదు...కాని...పై ఆఫీసర్లు అప్పటికే నాలుగైదు తాఖీదులు పంపించారు పని సరిగా జరగటంలేదని! మెల్లగావచ్చి కుర్చీలో కూలబడ్డాడు సూపరెండెంటు.

"బైపిష్టు వెంకటేశం!"

"రాలేదు సార్!" ఆఫీసు గోడలు యిచ్చిన సమాధానం!

గుమాస్తాలందరూ నిశ్శబ్దంగా వచ్చి వారి స్థానాల్లో కూర్చొన్నారు. "మీరందరూ పని చెయ్యటం మాని బయటకుపోతే ఆఫీసులో పనెలా జరుగుతుంది? సాయంకాలం నాలుగు గంటల వరకూ, నా పర్మిషన్ లేనిదే ఎవరూ కదల కూడదు. కదిలితే వారిపైన డిసిప్లినరీ ఏక్షన్ తీసుకొంటాను. జాగ్రత్త!" సూపరెండెంటు గట్టిగా అరిచాడు.

"నిన్నటివరకూ తమరుమాత్రం ఏం చేశారండి? కాగితం తెచ్చి సంతకం పెట్టమంటే ఇదా సమయం? అనడిగిన మీరే ఈనాడు శ్రీరంగ నీతులు చెప్పడాని కొచ్చారు. ఏది సమయమో ఏది కాదో మా కెలా తెలుస్తుంది? తమకు వీలు లేనప్పుడల్లా, తమరు ఉల్లాసంలో వున్నప్పుడల్లా, మేం కాగితా లుచ్చుకొని ఏడుస్తూ వెనక్కు రావాలా? మేం ఏదో పని చూచుకొంటున్నప్పుడు మీరు పిలిస్తే రావాలా? ఈ సంగతేమిటో మేమూ చూస్తాంలెండి!" అప్పటివరకూ మీటింగులో అరవటంవల్ల గొంతుక బొంగురుపోయినా గట్టిగా విప్లవాత్మకంగానే అరవగలిగాడు సీనియర్ క్లర్కు రమణారావు.

ఆ అరుపులకు దడదడలాడకపోయినా సూపరెండెంటు కొంచెం కంగారుపడ్డాడు. "ఇదిగో! ఆఫీసర్లందరూ పని సరిగా జరగటంలేదని ఇచ్చిన నోటీసులు! మీ అందరిమీదా అనవసరంగా రిపోర్టులు వ్రాయడం ఎందుకని ఊరుకొన్నాను. ఈ ధోరణిలో వుంటే మీ అందరి పనీ ఆఫీసరుతో ఇప్పుడే చెబుతాను!" తన శక్తికొలదీ అరిచాడు ఆయన.

"మీకన్న ముందు మేమే వెడతాం!" అంటూ లేచాడు రమణారావు. ఇప్పుడు దడదడలాడిపోతున్నాడు సూపరెండెంట్! క్లర్కు లందరూ విజయగర్వంతో నిటారుగా కూర్చున్నారు.

"అందుకు కాదోయ్ మిష్టర్ రమణారావ్! మనలో మనమే అలా కలహించుకొంటే ఎలా చెప్పు? ఆఫీసరు తాఖీదు చూశాను గనుక నాకంత కోపం వచ్చింది. మీరు కూడా అలా కోప్పడితే ఎలా? ఏమోయ్ రాజారావ్! అతన్ని కాస్త కూర్చోబెట్టు! ఏదో మనలోమనం సర్దుకుపోవాలిగాని, ఎందుకొచ్చిన గొడవోయ్? మన పని మనం చేసుకోకపోతే ఎలాగన్నాను అంతే!" సూపరెండెంట్ స్టైలు మారుస్తూ అన్నాడు.

"కూర్చో రా రమణా! అలా ఫైరయిపోతే ఎల్లారా? ఏదో సర్దుకుపోవాలిగాని!" రాజారావు సలహా ప్రకారం రమణారావు శాంతించాడు. క్లర్కులందరూ మెల్లగాలేచి వెళ్ళిపోయారు.

* * *

నాలుగు రోజుల తరువాత...ఆనాడే సావిత్రి వస్తుంది! సూపరెండెంట్ చూపు ఒక్క కుర్చీకే పరిమితమైవుంది. లోలోన ఆయన పడుతున్న ఆందోళన వర్ణనాతీతం. గుమాస్తాలందరూ తొంగి చూసి నిరుత్సాహ పడుతున్నారు. సరగా గడియారం పది గంటలు కొట్టింది...మధురస్మితవదన సావిత్రి తెల్లటి వాయిలు బట్టలలో తళతళా మెరుస్తున్నది. తలవంచుకొని చరచరా నడిచివచ్చి కుర్చీలో కూర్చొంది.

సూపరెండెంటు ఉత్సాహంగా తలెత్తి చూడలేక చూడలేక రెండు క్షణాలు చూసి, బాధగా తల దించుకొన్నాడు. గుమ్మంలో నిలబడి లోపలకు తొంగి చూసే ఎన్. జి. ఓలను మాత్రం గట్టిగా మందలించింది మధురస్మితవదన సావిత్రి మెడలో మెరసే క్రొత్త మంగళ సూత్రం.

---

మొదటి చూపులలోనే ప్రేమ అంకురించడం సహజమే కావచ్చు; ఐనా కళ్ళద్దాలను ఒకసారి తీసి తుడుచుకుని మళ్ళీ ఒకమాటు శ్రద్ధగా చూడడం ఎంతో అవసరం—డేన్.